# ఒంటరి వెన్నెల

– యం. రవళి ప్రశాంత్

సన్నగా చినుకులు పడుతున్నాయి. చీకటిని తరుముతున్నట్టుగా రోడ్డుమీద మెర్క్యురీ దీపాలు ప్రకాశవంతంగా వెలుగుతున్నాయి. సమయం రాత్రి 8 గంటలు. ముంబాయి హైవే మీద వేగంగా పరుగులు తీస్తోంది నల్లటి హోండా సిటీ కారు. 8.30 నిమిషాల వరకు అది ఓ బార్ ముందు ఆగింది. అంత ఖరీదయిన బార్ కాదుగానీ ఖరీదైన మను షులు వస్తుంటారు. యువతులు బార్టెండర్‌లున్న బార్‌లు అరుదుగా వుంటాయి. అలాం టివాటిలో ఇదొకటి. ఆ బార్‌లో అందరినీ పలకరిస్తూ నవ్వులు చిందిస్తూ, హొయలొలి కిస్తూ వెన్నెల జలతారులా తిరుగుతూ వైన్ సర్వ్ చేస్తుంది షబ్నమ్.



ఆమె రాక వెన్నెల వాన. దేవకన్య భువిలోకి విహారానికి పొరపాటున వచ్చిందా? లేక దివిలో తాము వున్నామా? అన్పిస్తుంది అక్కడికి వచ్చినవాళ్లకి. కొందరు షబ్న మ్‌ని మాత్రమే చూడడానికి వస్తే, మరికొందరు ఆమె చేతుల్తో త్రాగాలని వస్తారు. నీకోసం అన్నట్లుంటాయి ఆమె చూపులు. షబ్నమ్ అందరి కళ్లకి అందంగానే కని పిస్తుంది. కొందరికి అందం ఏదో ఒకచోట అందం, ప్రత్యేకత వుంటే, అందమే ఆమెలా వుంటుంది అన్పిస్తుంది.

మొదటి పెగ్ పడిన తరువాత షబ్నమ్‌లో అందంతోపాటు వంపులు కనిపిస్తాయి. కొందరు ఆమె పెదవుల్తో సిప్ చేసిన తరువాత మేము త్రాగితే ఆ అనుభూతి వేరం టారు. అందరితోనూ నవ్వుతూ, తుళ్లుతూ వుంటుంది. అది ఆమె సౌందర్యంలోని విశేషం కావచ్చు, వృత్తి ధర్మం కావచ్చు. ఏదేమైనా చూసే కళ్లకి ఆమే ఓ సౌందర్య దీపం. ఆ దీపపు కాంతి సాయంతో ముందుకు పయనించే వాళ్లుంటారు. దాన్ని పట్టుకోవాలని చేతుల్ని కాల్చుకున్న వాళ్లుంటారు.

చుక్క పడితేగాని బుక్కపడదు. కన్నుపడిందంటే అందేదాకా తపన– తపస్సు! అతనే చౌదరి. గోపాల్ చౌదరి. ఆస్తి, హోదా, దశపై పరుగెడుతున్న యాభై ఏళ్ల గోపాల్ చౌదరికి మందన్నా, మగువన్నా మక్కువ ఎక్కువ. మిగతా అర్హతలు షరా మామూలే! వారం క్రితం బిజినెస్ వ్యవహారం మీద ముంబాయి వచ్చినపుడు ఈ బార్‌కి రావటం తటస్థించింది. అపుడు షబ్నమ్ రూపం మనసులో అలలా కదిలి ఆగిపోయింది. ఆమె అందం అతన్ని బాగా ఆకర్షించింది.

పాజిబుల్!

ఎందుకంటే మనిషి బలహీనతలకి బానిస అనేది పాత చరిత్ర. అదే చరిత్ర చౌదరి విషయంలో పునరావృతం అయింది.

మళ్లీ ఈరోజు–

ఇదీ అంటూ చెప్పుకోవలస్సిన గొప్పతనం ఏం లేదు అతనిలో. అతని దగ్గరున్న ఆస్తి తప్ప గోపాల్ చౌదరి శృంగార పురుషుడు. ఇంట్లో నిర్మలంగా, నిరాడంబ రంగా, సాధారణ సౌందర్యంతో ఇల్లాలుగా జీవించే భార్య. అతను ఏం చేసినా చేస్తున్నా అది ఆయన బిజినెస్ వ్యవహారాల్లో టూర్‌లో వుంటున్నా, ఆమె అలాం టివేం పట్టించుకోదు. పూజలు, వ్రతాలు అంటూ ఉన్న కొద్దిరోజులయినా వాటి తోనే కాలం గడిపేస్తుంది. ఇది ఏమాత్రం నచ్చని చౌదరి మొదట్లో చెప్పి చూసాడు. ఇపుడు చెప్పడం మానేసాడు. కొన్ని మార్పులకు కారణం పరిస్థితులే!

సమయం పదిగంటలు దాటింది. బార్‌లో లైట్లు డిమ్‌గా వెలుగుతున్నాయి. సన్నటి పాశ్చాత్య సంగీతం వినబడుతోంది. స్టేజిపై డాన్స్ మొదలయింది. జంట లుగా, ఒంటరిగా, గుంపులుగా జనం వస్తున్నారు. దాంతోపాటు మ్యూజిక్ వాల్యూమ్ కూడా పెరిగింది. కార్నర్ టేబుల్ ముందు కూర్చుని వైన్ సిప్ చేస్తు న్నాడు చౌదరి. అతని దృష్టి రెండవ టేబుల్‌పై సర్వ్ చేస్తున్న యువతిని గమనిం చింది. నిజం అందం అనే పదానికి ప్రాణం వస్తే అది ఈమెలాగే వుంటుందన్పిం చింది.

ఆమె నెమ్మదిగా అతడ్ని సమీపించింది.

''హలో'' అంది.

''హలో, యువర్ స్వీట్ నేమ్''

''షబ్నమ్''

''షబ్నమ్ అంటే, ఓహ్! మంచు వెన్నెల. నిజంగా నీకు తగిన పేరు.''

దానికి ఆమె వెన్నెల కురిసినట్లు నవ్వి అడిగింది.

''మీరు స్లోనా?''

''ఎందులో?''

''డ్రింక్ తీసుకోవటంలో''

''కొన్నింటిలో స్లో వుండాలి. మరికొన్నింటిలో స్పీడ్ వుండాలి''

''ఎందులో స్పీడ్?''

''అందులో'' అన్నాడు నవ్వుతూ.

శృతి కలిపి నవ్వింది.

''మందు తాగే మగాళ్ల ముందు అందమైన ఆడాళ్లు నవ్వకూడదు''

''ఎందుకని?''

''తెలీదా?''



''మీరు చెప్పండి''

''మనసు, శరీరం వశం తప్పుతాయి'' ఆమె నవ్వింది.

అదిగో మళ్లీ నవ్వులు.

''వృత్తి ధర్మం''

''నిజమే!''

''త్రాగండి''

''సిప్ చేస్తావా?''

''చేయనా?''

''ఆన్ మై లిప్స్''

''ఇక్కడ కాదు''

''ఎక్కడ?''

''పదకొండు తరువాత''

''ఈ రాత్రి...'' ఆగాడు.

''చెప్పండి''

''నాతో గడపగలవా?''

''వైనాట్''

''ఎంత?''

''శృంగారానికి ఖరీదు చెప్పకూడదు. అనుభవాన్ని బట్టి వుంటుంది.''

''అర్హతనుబట్టి''

''కావచ్చు''

బార్ బయట వర్షం కురుస్తూనే వుంది... కారు ముందు నిలబడ్డాడు చౌదరి. సిగరెట్టు వెలిగిస్తూ షబ్నమ్‌తో గడిపే అందమైన క్షణాల్ని లెక్కిస్తున్నాడు.

పదకొండు గంటలయింది. షబ్నమ్ కళ్లు అతని కోసం వెతుకుతున్నాయి. అతడు కన్పించగానే చిరునవ్వు నవ్వింది. కారు డోర్ తెరిచి కూర్చుంది.

చౌదరి డ్రైవింగ్ సీట్‌లో కూర్చున్నాడు.

ఆమె సిగరెట్ వెలిగించింది. ''ఎక్కడికి?'' అడిగాడు.

''మా ఇంటికి''

కారు స్పీడ్ అందుకుంది. షబ్నమ్‌ని గమనిస్తూ డ్రైవింగ్ చేస్తున్నాడు. అతడి కళ్లు కెమెరాలై ఆమె ప్రతి అణువుని ఫోటో తీస్తున్నాయి. తనకి ఇంత వయసులో ఎంతోమంది పరిచయం అయినా ఇంతటి అలజడికి కారణమైన అందాన్ని ఎంత చూసినా మళ్లీ మళ్లీ చూడాలనిపిస్తుంది. మరికొద్ది నిమిషాల్లో తన స్వంతం కాబోతున్నందుకు సంతోషంగానూ, గర్వంగానూ జీవితం ధన్యమైపోతుంది అనే ఫీలింగ్. ఇంత అనుభవం వున్న తను ఆమెను ముట్టుకోవాలంటేనే అదోరకమైన వణుకు. ఎందుకు ఇలా జరుగుతోంది? ధైర్యం చేసి చేతిని మృదువుగా స్పృశించాడు. ఆ స్పర్శకి అతడికి అదోరకమైన మత్తైన పులకింత.

గొంతు సవరించాడు. ఆమె అతడి వైపు చూసింది.

''నీ పేరు షబ్నమ్ కదూ! నిజంగా మీ అమ్మ నాకు తగిన పేరును బలే కరెక్ట్‌గా సెలక్ట్ చేసింది.''

''కాదు నేనే సెలక్ట్ చేసుకున్నాను''

''నిజమా?''

''అవును!''

''ఎందుకు?'' అన్నాడు అలా అడగడం అనవసరం అని తెల్సినా కూడా!''

''చెప్పమంటారా?''

''అభ్యంతరం లేకపోతే చెప్పొచ్చు''

''ఇంతవరకు ఎవరూ అడగలేదు'' అంది.

''ఇంట్లో ఎవరెవరుంటారు?''

''నేనే''

''అమ్మా, నాన్న?''

''అమ్మ చనిపోయింది''

''నాన్న?''

''కుంతీపుత్రికను'' నవ్వింది.

''ఎక్కువగా తాగావా?''

''పది సిప్‌లు మాత్రమే!''

''ఇంకా త్రాగుతావా?''

''వద్దు''

''ఇంతకు ముందు నీ పేరు నీవే సెలక్ట్ చేసుకున్నానన్నావు. మీ అమ్మ నీకేం పేరు పెట్టలేదా?''

''పెట్టింది సుజాత. అంటే మంచి జాతకం (జన్మ) కలది అని అర్థం. కానీ నేను ఇలా అవుతానని తను ఊహించి వుంటే నాకు ఆ పేరు పెట్టి వుండేది కాదు.

నాలాంటి వారికి ఆ పేరు సరియైంది కాదని షబ్నమ్, అంటే వెన్నెల అందరికీ సమంగా వెలుగు, వెన్నెలను పంచినట్లే నా సొగసు మంచు వెన్నెల ఖరీదు కరెక్టుగా ఇచ్చినవారికి అందిస్తాను'' అంది మత్తుగా నవ్వుతూ.

వర్షం ఎక్కువయింది. షబ్నమ్ ఇస్తున్న సూచనల ప్రకారం కారు డ్రైవ్ చేస్తున్నాడతడు.

''ఇక్కడ లెఫ్ట్‌లో ఆపండి'' అంది.

అగ్గిపెట్టి లాంటి చిన్న మేడముందు కారాగింది. చుట్టూ గార్డెన్. చుట్టుపక్కల ఇళ్లన్నీ నిశ్శబ్దంగా వున్నాయి. కారు దిగింది. గేటు తెరిచింది. లోపలికి నడిచి ''కారు లోపలికి తీసుకురండి'' అంది.

కారు గేటు లోపలికి పోనిచ్చి కారు దిగాడు చౌదరి.

తలుపు తెరిచి ''రండి'' అంది. చౌదరి సోఫాలో కూర్చున్నాడు. తను చెప్పడం ప్రారంభించింది.

''మా అమ్మ కాలేజ్ చదివే రోజుల్లో ఒక అబ్బాయిని ప్రేమించిందట. వయసు తొందరలో జరిగిన తప్పుకు గుర్తును నేను. ఆ వ్యక్తి పెళ్లి చేసుకోమంటే వాళ్ల తల్లిదండ్రుల్ని అడిగి ఒప్పుకుంటేనే చేసుకుంటాను అన్నాడట. తప్పు త్రోవలో వెళ్లేటపుడు తల్లిదండ్రుల అంగీకారం అవసరం లేదుగానీ పెళ్లి అనగానే అపుడు గుర్తొస్తుంది అమ్మా, నాన్న అంగీకారం వుంటేగాని చేసుకోలేం అని.

అలాంటి పిరికి ప్రేమికుల గుర్తులుగా చంపేయబడిన, కుంతీపుత్రులు, కుంతీపుత్రికలు ఎందరో. కానీ మా అమ్మ అతన్ని మనస్ఫూర్తిగా ప్రేమించింది. నాలో తన రక్తం, ప్రాణం వుందని భావించి, నాలో అతన్ని చూసుకుంటూ కాలం గడిపేది. నన్ను ఓ మంచి డాక్టర్‌ని చేసి పదిమందికి సేవ చేయాలని ఆశించేది. తను ఓ ప్రైవేటు సంస్థలో ఉద్యోగం చేస్తూ, నన్ను పోషించేది.

కాలం గడుస్తూనే వుంది. నేను ఏడవ తరగతి చదువుతున్నాను. అమ్మ ఎపుడూ చెపుతుండేది. ఈ యేడు పరీక్షలు అవగానే ముంబాయి వెళదాం. అక్కడైతే ఇంగ్లీషు మీడియం స్కూల్లో చేర్పిస్తానని అనేది. పరీక్షలు అయిపోయాయి. వేసవి సెలవులు.

## ఖరీదైన స్టాంపు



మనదేశంలోని పోస్టల్ స్టాంపుల్లో అతి విలువైన స్టాంపు యాభై రూపాయల ఖరీదైన స్టాంపు. *1986*వ సంవత్సరం నవంబర్ *5*వ తేదీన 'గాలిశక్తి' పేరిట ఈ స్టాంపును ప్రభుత్వం ముద్రించింది.

## సంపాదించే పశువులు

మనదేశంలో గల గేదెలను, ఆవులను, ఎద్దులను మనం తక్కువ అంచనా వేస్తాం. వాటిని తేలిగ్గా చూస్తాం. అయితే వాటివల్ల ఎన్నెన్ని లాభాలు కలుగుతున్నదీ, అవి మనకు ఎంతటి సేవలు చేస్తున్నదీ గుర్తించాం. *420* మిలియన్ల గేదెలు, ఎద్దులు వగైరాలు మనదేశంలో వున్నాయి. అవి మనకు పాల రూపంలోగానీ, సేవారూపంలోగానీ, పేడ, చర్మం, కొమ్ముల వంటివాటివల్లగానీ *50*వేల కోట్ల రూపాయల ఆదాయాన్ని అందిస్తున్నాయి. ఈ ఆదాయం మనదేశానికి వివిధ వనరులద్వారా లభించే ఆదాయంలో *10*శాతంతో సమానం. *80*మిలియన్ల ఎద్దులు, దున్నపోతులు *6*మిలియన్ల టన్నుల పెట్రోలియంను మనకు ఆదాచేసి పెడుతున్నాయి. దాని విలువ ఒక సంవత్సరానికి *4*వేల కోట్ల రూపాయలు. ఆవులు, గేదెలు మనకు *50*మిలియన్ టన్నుల పాలను అందిస్తున్నాయి.

## బహుమతి

ఒక పెద్ద కంపెనీ యజమాని ఒకరోజున తన సిబ్బందినందరినీ సమావేశపరిచి, ''మన కంపెనీలో అయ్యే ఖర్చును పొదుపు చెయ్యడానికి అవసరమైన మంచి సలహాలను ఇచ్చినవారికి వెయ్యి రూపాయలు ప్రథమ బహుమతిగా ఇస్తాను'' అన్నాడు.

వెంటనే అప్పారావు లేచి, ''సార్! మొదటి బహుమతిని అయిదొందలకు తగ్గించండి'' అని సలహా ఇచ్చాడు.

ప్రథమ బహుమతిని అప్పారావుకే ఇచ్చాడు యజమాని.

**-కొడిమెల**

ఓ మంచిరోజు చూసుకొని ముంబాయి బయలుదేరాం!

ట్రైన్ వేగంగా పరుగులు తీస్తోంది నా ఆలోచనలలాగానే! అమ్మ ఒడిలో నా తల చేత్తో నిమురుతోంది. ఎంత హాయిగా వుంది. అమ్మ ఒడిలో వుంటే చాలు ఆకలిదప్పులుండవు అన్పించింది. అలాగే హాయిగా కళ్లు మూతలు పడుతున్నాయి. కలల లోకం స్వాగతం పలుకుతోంది జీవితంలోని రంగుల్ని చూపుతూ...

స్వప్నలోకంలో విహరిస్తున్న నేను అకస్మాత్తుగా వినిపించిన భయంకరమైన పెద్ద శబ్దానికి కళ్లు తెరిచాను. అంతే కళ్లముందు అంతా పొగలాగా చుట్టూ చీకటి. అరుపులు, కేకలు, ఏడ్పులు. నాకు ఏం జరిగిందో అర్థం కావడం లేదు. ఆ షాక్ నుండి తేరుకొని అమ్మ కోసం చూసాను. లేదు. బలమైన గాయం తలకి తగలడం వల్ల ఆ నొప్పితోబాటు కడుపులో ఏదో వికారం. అప్రయత్నంగా కంటిమీదుగా కారుతున్నదాన్ని చేత్తో తుడిచాను. రక్తం... క్రమక్రమంగా కళ్లు చీకటి నుండి చీకటిగా మూతలు పడుతున్నాయి. ఎవరో నా చేయి పట్టుకున్నారు. శబ్దాలు దూరమైపోతున్నట్టు నాకు ఏం జరిగిందో అర్థం కాలేదు.

కళ్లు తెరిచేసరికి ఒక పెద్ద ఇంట్లో తను. ఎదురుగా ఒక ఆంటీ. యాభై సంవత్సరాలు వుండవచ్చు. ముస్లింలాగా వుంది ఆ అలంకరణ చూస్తుంటే!

''బచ్చీకు హోష్ ఆయారే. మస్తాన్ జల్దీ ఆవో'' అంటూ హిందీ ఏదో మాట్లాడింది. నేను అమ్మ గురించి అడిగాను. ''ఇకపై నేనే మీ అమ్మ'' అని చెప్పింది. తిండికి ఎలాంటి కొరత లేదు. నన్ను కూర్చోబెట్టి తిండి ఎందుకు పెడుతుందో అర్థం కాలేదు. అక్కడి వాతావరణం కూడా అర్థం కాలేదు.

నేను చదువుకుంటాను అని చెప్పాను. తను అంగీకరించేది కాదు. కాలచక్రం పరిగెడుతూనే వుంది. క్షణాలు, నిమిషాల్లోనికి, నిమిషాలు గంటల్లోకి, గంటలు రోజుల్లోకి, సంవత్సరాల్లోకి దాటిపోయాయి. నా వయసు పదహారు సంవత్సరాలు.

ఓరోజు ఎవరో కొందరు వచ్చారు. ఆంటీ నన్ను బాగా అలంకరించి, అద్దం ముందు కూర్చున్న నా బుగ్గల్ని ముద్దాడుతూ అంది. ''మేరీ సోనా షబ్నమ్'' అని. ఆమాట నాకు ఇంకా గుర్తున్నది. నా బంగారు తుషారం అని. ఆరోజు నుండి నాకు కష్టాలు ప్రారంభం అయ్యాయి. ఇంతకాలం వీళ్ళెందుకు నన్ను చేరదీసారో అర్థం అయ్యేసరికి నాకంటూ నేనేం మిగల్లేదు. నేనేం చేయలేని నిస్సహాయురాల్ని. తప్పించుకునేందుకు చేసిన ప్రయత్నాల వల్ల వంటికి గాయాలు తప్ప మరేం లేదు.

ఆరోజు ఫిబ్రవరి 29. ఓ ఖరీదైన వ్యక్తి వచ్చాడు. ఆంటీ అతనికి నన్ను చూపించింది. తరువాత అతను నాగదిలోకి వచ్చి నావైపు వస్తుంటే చేతుల్ని జోడించాను. అతను నాదగ్గరికి రాగానే కళ్ళు మూసుకున్నాను. అతని పెదాలు నా పాదాల్ని చుంబించాయి. నేను ఆశ్చర్యంతో కళ్ళు తెరిచాను.

అతనే ప్రారంభించాడు. నేను చాలా నచ్చానని చెప్పాడు. ''అందరూ చెప్పేమాటే వెళ్ళేముందు. కానీ ఇతడు రాగానే అంటున్నాడేమిటి?'' అనుకుంది.

''నాపేరు చక్రధర్. నేను నీకు నచ్చానా? నీకు నచ్చితే నిన్ను నాతోపాటు తీసుకువెళతాను.''

ఆనందంతో నా నోట మాట రాలేదు.

అవునంటూ తల ఊపాను.

ఈసారి నేను అతని పాదాలకి నమస్కరించాను. అతను నన్ను లేవదీసి నుదిటిపై చుంబించి చెప్పాడు.

''ఓ మై మీరీ షబ్నమ్, బీ హ్యాపీ''

అతను వెళ్ళి ఆంటీతో ఏదో మాట్లాడాడు. మొదట ఒప్పుకోకపోయినా ఎక్కువ మొత్తం డబ్బు ఇచ్చి ఎలాగోలా ఒప్పించి ఆ పంజరంలోంచి నన్ను విడిపించాడు. తన ఎస్టేట్‌కి తీసుకువెళ్ళాడు. అపుడు నేను చూస్తున్నది 18వ వసంతాన్ని. ప్రతిక్షణం వసంతం లాగే అన్పించేది. రోజులు ఇలా గడుస్తున్నాయి.

ఓరోజు రాత్రి 9 గంటలు. భోజనాలు అయ్యాక లాన్‌లో తిరుగుతున్న చక్రధర్ పరిగెత్తుకుంటూ ఇంట్లోకి వచ్చాడు. ఏం జరిగింది అని అడిగేలోపల బలాఢ్యులైన వ్యక్తులు ఇంట్లోకి ప్రవేశించి నా కళ్ళ ముందే వద్దంటున్నా వినకుండా కత్తుల్తో పొడిచి వెళ్ళిపోయారు. కొన ఊపిరితో ఉన్న చక్రధర్ దగ్గరికి వెళ్ళిన నాకు గుండెను పిండుతున్నట్టు అనిపించింది. బాధను ఎంత అదిమిపెట్టినా ఎగిసి పడుతోంది.

కొనప్రాణంతో చెప్పాడు.

''మై మీరీ షబ్నమ్ బి...''

ప్రాణం అనంత వాయువుల్లో లీనమైపోయింది. ఒంటరి... తను ఒంటరి... ఈ భావనను భరించడమే కష్టంగా వుంది. చక్రధర్‌ని ఎవరు చంపారో, ఎందుకు చంపారో తెలియదు. తెలిసినా తనేం చేయలేదు.

రోజులు శూన్యంగా గడుస్తున్నాయి. చక్రధర్ జ్ఞాపకం రావడం లేదు. ఎందుకంటే తను మరిచిపోలేకపోతుంది. డబ్బులు అయిపోతున్నాయి. తిండి తినకుండా ఎంతకాలం ఉండగలదు. తప్పదు తిరిగి బయటి ప్రపంచంలోకి అడుగుపెట్టాలి. ఏదైనా మంచి ఉద్యోగం చేద్దామంటే సరియైన చదువులేదు. చదువుదామంటే డబ్బులేదు. దానికి తోడు ఆకలి... చాలా భయంకరమైన ఆకలి.

''మృత్యువు కంటే భయంకరమైన ఆకలి'' అన్నాడొక గొప్ప వ్యక్తి.

ఆకలి కోసం... కూటికోసం కోటి విద్యలు అన్నారు. తనకు తెలిసిన విద్య 'అందరి వెన్నెల'గా మారిన రోజు బార్టెండర్‌గా చేరాను'' చెప్పడం ఆపి ఓ రెండు ఫోటోలు చూపిస్తూ ''ఇది మా అమ్మది, బ్లూషర్ట్ చక్రధర్‌ది'' అంటూ, ఫోటో ఆల్బమ్ చేతికిచ్చి, డ్రస్ చేంజ్ చేసుకొస్తానని లోపలికి వెళ్ళింది షబ్నమ్.

ఫోటోవంక చూసాడు మాధురి. తన మాధురి, తనని ప్రాణంలా ప్రేమించిన మాధురి. తన ప్రాణం సర్వస్వం. తల్లిదండ్రుల్ని ఎదిరించలేక మనసు చంపుకొని, మరచిపోకపోయిన తన మాధురి అప్పట్లో మాధురి అతని ఊపిరి. కాలం, డబ్బు తనని ఇలా మార్చేసిందేమిటి? 'షబ్నమ్' నా కూతురన్నమాట, ప్రాణంలో, రక్తంలో, శరీరంలో పాలుపంచుకు పుట్టిన నా పాప. అప్రయత్నంగా కళ్ళు చెమర్చాయి.

నరాలన్నీ తెగిపోతున్న ఫీలింగ్, వైన్ మత్తంతా క్షణంలో దిగిపోయింది. తను తండ్రి అనే విషయం తెలిస్తే నేనిచ్చే డబ్బులు తీసుకోదు. ఎలా? ఆలోచన రాగానే చెక్‌బుక్ తీసి చెక్ రాసి ఆల్బమ్ పక్కనే పెట్టి వడి వడిగా వెళ్ళిపోయాడు. షబ్నమ్ బయటకు వచ్చింది. అతను కనిపించలేదు. ఆల్బమ్ పక్కనే గాలికి కదులుతున్న చెక్. చూసింది. ఎందుకు వెళ్ళిపోయాడో, ఇంత డబ్బు ఎందుకిచ్చాడో ఆమెకు అర్థం కాలేదు. అర్థం కాదు కూడా!

చెక్ పర్స్‌లోకి నెడుతూ అనుకుంది ''షబ్నమ్ యూ ఆర్ లక్కీ!'' అని.

★